# పిల్ల-చూపులు

సింహప్రసాద్

బస్సు దిగాక, చొక్కా పంచె సర్దుకుంటూ "ఆటోమీద వెళ్దాముట్రా" అన్నారు మేనల్లుడు చంద్రంతో ఆంజనేయులుగారు.

"వెళ్దాంలే. ఒక్క నిమిషం." తన చేతిలోని జిప్‌బాగ్‌ని అక్కగారి కందిచ్చి దగ్గర్లోనే ఉన్న న్యూ మోడ్రన్ హెయిర్ కటింగ్ సెలూన్‌లో కెళ్ళాడు చంద్రం.

"కటింగా, సార్?

"కాదు. షేడ్రాయి. హెయిర్ డ్రయింగు కూడా చెయ్యి." కుర్చీలో కూర్చుంటూ అన్నాడు.

తల మీద నీళ్ళు స్ప్రేచేసి ఎలక్ట్రిక్ మెషిన్‌తో డ్రై చేసి చంద్రం కోరిక మీద వంకీలు వచ్చేలా ఒత్తాడు. ముఖం మీద కూడా నీళ్ళు చిలకరించి పొడి గుడ్డతో తుడిచి పావలా మందాన స్నో రాసి పౌడ రద్దాడు.

అద్దంలో కనిపిస్తోన్న తన ప్రతిబింబాన్ని చూసుకుని మురిసిపోయాడు చంద్రం. మేకప్ పుణ్యమా అని ముఖం కాస్త తెల్లబడినా, ఆకర్షణీయంగా ఉంది. వంకీల జుట్టు కొత్త అందాన్ని తెస్తోంది.

ఫర్వాలేదు. హో గంటన్నరవరకూ ఉంటుందిలే అనుకుంటూ రెండు రూపాయలు ఇచ్చి బయటి కొచ్చాడు. రెండడుగులు వేసి మళ్ళీ వెనక్కెళ్ళి ప్రక్కన బడ్డీలో ఇంగ్లీషు పేపరు కొనుక్కొచ్చాడు గొప్పగా కన్పిస్తాడని.

"శుభమా అంటూ పెళ్ళిచూపుల కెళ్తుంటే మధ్యలో ఈ పనేమిట్రా" అని కోప్పడబోయి ఆగిపోయి మేనల్లుడి ముఖం వంక మొదట ఆశ్చర్యంగానూ, ఆ పిమ్మట అపురూపంగానూ చూశారు ఆంజనేయులుగారు. నల్లగా ఉండే చంద్రం ఇప్పుడు చామన చాయగా కన్పిస్తున్నాడు మరి!



చంద్రం అక్క పరమేశ్వరి కూడా తమ్ముడి వంక మురిపెంగా చూసింది. గుండెల్లో తొలుస్తోన్న అనుమానం జారిపోగా ఈ సంబంధం కుదిరి పోయినట్లే అనుకుని ఆడపడుచు లాంఛనాల గురించి లెక్కవెయ్యసాగింది.

ఆటోమీద ముగ్గురూ రామ చంద్రయ్యగా రింటి కెళ్ళారు.

ఆయనా, ఆయన తమ్ముడూ, వారి అబ్బాయిలూ ఆదరంగా ఆహ్వానించి— "ప్రయాణం బాగా సాగిందా? చెప్పిన టైముకి ఖచ్చితంగా వచ్చేశారే" అంటూ కుశల ప్రశ్నలు వేశారు.

ఇంటినీ, ఇంటి ముందు భాగంలో ఉన్న బట్టల షాపునీ, అందులోని సరుకునీ పరిశీలనగా చూసి రామ చంద్రయ్య గారి స్థితిగతుల్ని అంచనా వేసుకుంటూ— "ఆలస్యం ఉందా" అనడిగారు ఆంజనేయులుగారు.

"అబ్బెబ్బే— ఏం లేదు. దాహం పుచ్చుకుంటారా?"

"కతికితే అతకదని శాస్త్రం కదా. ముందమ్మాయిని చూద్దాం."

"అలాగే — రండి."

లోపలి గదిలోకి తీసుకెళ్ళి కుర్చీలు చూపించారు.

అగరువత్తుల పరిమళా న్నాస్వాదిస్తూ కుర్చీల్లో కూర్చున్నారు.

పైన సీలింగ్ ఫాన్ గిర్రున తిరుగుతోంది. రెండు ట్యూబు లైట్లూ తమ శక్తిని మించి తెల్లని వెలుగును విరజిమ్ముతున్నాయి. గోడలని పూర్తిగా ఆక్రమించిన దేవుళ్ళ ఫోటోలూ కాలండర్లూ, గదిలోని ఇనప్పెట్టె, బీరువా, టేబిలూ, కుర్చీలూ వగైరాలు ఉక్కిరిబిక్కిరవుతున్నట్టుగా ఉన్నాయి స్థలం తక్కువై.

గదిలోకి సూర్యకాంతి రాదు. వాయుదేవుడూ రాలేడు మరి!

మరి కొన్ని నిమిషాలకి శారదని లోపలికి తీసుకొచ్చి అందరికీ నమస్కారింపజేసి చాప మీద కూర్చోబెట్టారు.

సన్నగా, కాస్త పొట్టిగా ఉందామె. జరీ పనితనానికి ఉదాహరణగా చూపించదగిన ఎర్రని పట్టుచీర కట్టుకుంది. అదే రంగు గల పట్టు జాకెట్టు తొడుక్కుంది. నడుముకి వడ్డాణం, చేతులకి అరవంకీలూ పెట్టుకుంది. మెడలో నెక్లెస్, ముత్యాల దండ, లాకెట్ ధరించింది. చెవులకి జూకాలూ, పాపిట్లో పాపిడి పిందె, తలమీద సూర్యుడూ, చంద్రుడూ కూడా పెట్టుకుంది. చేతులకి నాలుగు జతల బంగారం గాజులూ, కాళ్ళకి వెండి పట్టాలూ అలంకరించుకుంది. ముఖానికి స్నో, పౌడరు ఒత్తుగా రాసినా అందమే తెచ్చిపెట్టాయి. పొడుగాటి పూల జడ వేసుకునున్న శారద ఎంతో అందంగా పుత్తడిబొమ్మలా కన్పించింది చంద్రానికి.

అతని కళ్ళలోని మెరుపుని కనిపెట్టిన ఆంజనేయులు గారు "ప్రాయం వస్తే పంది పిల్లకూడా పసందుగానే ఉంటుంది. అలంకరిస్తే గాడిద కూడా గొప్పగానే ఉంటుంది" అన్నారు మెల్లగా చెవిలో.

గతుక్కుమని మళ్ళీ చూశా డతడామెని.

అవనత ముఖియై ఉండటంతో ఆమె ముఖం అస్పష్టంగా కన్పిస్తోంది. బావున్నట్టనిపిస్తోంది గానీ, ఏం చెప్పగలంలే. ఈ రోజుల్లో కృత్రిమ అందానికి సవాలక్ష కాస్మెటిక్స్ దొరుకుతున్నాయి. పైగా ట్యూబులైట్లొకటి. తనలాటి వాళ్ళని బుట్టలో వేసుకోడానికే ఈ ఏర్పాట్లన్నీనూ! అనుకోసాగాడు చంద్రం..

"నీ పేరేమిటమ్మాయ్?" అంజనేయులుగా రడిగారు.

"శారదండి."

"ఏం చదివావూ?" ఆమెనీ ఆమె ధరించిన బంగారాన్నీ గుచ్చిగుచ్చి చూస్తోన్న పరమేశ్వరి అడిగింది.

"బి. యస్సీ అండి."

"ఫస్ట్‌క్లాసొచ్చిందండి." ఆమె అన్నగా రన్నాడు వెంటనే.

భుజాలు తడుముకున్నాడు చంద్రం. తను బికాం సెకండ్ క్లాసాయె!

"ఈ పుస్తకం చదువమ్మా!" టేబుల్ మీదున్న తెలుగు వీక్లీని అందిస్తూ అన్నారు ఆంజనేయులుగారు.

మొదట కొంచెం తడబడినా,స్పష్టంగా చదివింది.

ఆమె స్వర మాధుర్యాని కంతా అచ్చెరు వందుతూంటే ఇంకొకాయన చంద్రంచేతిలోని ఇంగ్లీషు పేపరు తీసుకుని శారద కిచ్చి చదవ మన్నాడు.

చకచకా చదివేసింది.


దాంతో కొంచెం అవమానంగా ఫీల్ అయ్యారు ఆంజనేయులుగారూ, ఆయన మేనల్లుడూనూ.

దానికి తోడు— "మా అమ్మాయి పేరుకి తగ్గట్టు చదువుల సరస్వతండి" అని రామచంద్రయ్యగా రనేసరికి తలూపక తప్పలేదు కూడా!

"ఒకసారిలా రెండడుగులు వెయ్యమ్మా."

శారద లేచి అటూ ఇటూ నడిచింది.

"పాటలేమైనా వచ్చా?"




పరమేశ్వరి ప్రశ్నకి— "రావండి" అనేసిం దామె వెంటనే.

"లోపలి కెళ్ళి ముఖం కడుక్కుని, మామూలు చీర కట్టుకుని, మామూలు జడ వేసుకుని అలా వీధిలోకి రామ్మా. ఆభరణాలేం వద్దులే. పౌడరు కూడా రాసుకోకమ్మా. ఇంట్లో ఎలా ఉంటావో అలా రా" అన్నారు ఆంజనేయులుగారు.

ఇలా సింపుల్‌గా రమ్మని చూడటం తమలో సర్వ సాధారణమని తెలిసినా, కొంచెంగా కోపం వచ్చింది శారదకి. అయినా అదేమీ కనబరచకుండా తలూపి లోపలి కెళ్ళిపోయింది.

"ఫలహారం తీసుకుందురుగాని రండి."

హాల్లో కొచ్చి కూర్చున్నారు.

నాలుగు రకాల స్వీట్లూ, హాట్లూ, బిస్కెట్లూ పెట్టారు ప్లేట్లలో. అవి తిని, టీ త్రాగుతూ లోకాభిరామాయణంలో పడ్డా రంతా.

మెల్లగా అన్నారు రామచంద్రయ్య గారు, "ఇచ్చి పుచ్చుకోవడం గురించి కూడా ఒకమా టనుకుంటే బావుంటుంది."

"దాందేముంది అలాగే అనుకుందాం. నా మేనల్లుడని నే నడగడం కాదు గాని, మా వాడు బుద్ధిమంతుడని మా వూరి వాళ్ళ నెవర్నడిగినా చెబుతారు. మరీ అందగాడనను గాని, చూడ చక్కనివాడని మీరే ఒప్పుకుంటారు. దురలవాట్లంటే ఏమిటో తెలీదు. బికామ్ హై సెకండ్ క్లాసులో పాసయ్యాడు. ఫస్టుక్లాసుకి ఒకటంటే ఒక్క మార్కు తక్కువ. రేపో మాపో బాంకులో మంచి ఉద్యోగం రాబోతోంది. నలభై వే లిస్తాం. యాభై వేలిస్తా మంటూ చాలా మంది వస్తున్నారు. కాని, మాకు సంప్రదాయం, వంశం, మర్యాద ముఖ్యం. అంచేతే ముందిక్కడికి వచ్చాం. అదీ సంగతి." గుక్కతిప్పుకోకుండా చెప్పేశారు ఆంజనేయులుగారు.

"మా శారదని చూశారుగా. అంత ఎర్రగా, అందంగా ఉండటమే గాక బియస్సీ ఫస్టు క్లాసులో పాసైన అమ్మాయి మన వాళ్ళలో చాలా అరుదని మేం ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఇక కట్నం పద్దైదువే లిస్తాం. లాంఛనాలవీ బాగా జరిపిస్తాం."

"పద్దైదువేలా? ఈ రోజుల్లో తల మాసిన వాడిక్కూడా ఇస్తున్నారు కదండీ. ఈ సంగతి తెలిస్తే తొందర పడెందుకెళ్ళావని మా బావ నా మీద కూకలేస్తారు కూడా."

"మీకు తెలీందేముంది. కరువు వల్ల వ్యాపారాలేం సాగటంలేదు. చేను వున్నా రెండు మూటల శనక్కాయలు కూడా రావటం లేదు. పైగా పెళ్ళి ఖర్చులు ఉండనే ఉంది."

"అబ్బెబ్బే అలా అని తెలిస్తే ఇంత దూరం వచ్చేవాళ్ళం కాదు. వచ్చినా, అమ్మాయిని చూసే వాళ్ళం కాదు. పోనీ ముప్పై ఇవ్వగలరా?"

"రెండో మూడో ఎక్కువంటే ఇవ్వగలం గానీ, మరీ రెట్టింపంటే ..."

"ఇది కుదిరే వ్యవహారం కాదు గానీ, లేవరా అబ్బాయ్" అంటూ లేచి ఒక్క అడుగు వేశారు ఆంజనేయులుగారు. అయోమయంగా చూస్తూ లేచి నిలబడ్డారు చంద్రమూ, అతడి అక్కానూ.

"పెద్దవారు మీరు కూడా అలా తొందరపడితే ఎలా, బావగారూ? ముందు కూర్చోండి చెబుతా. వ్యవహార మన్నాక పట్టూ విడుపూ ఉండాలి కదా" అన్నారు రామచంద్రయ్యగారి తమ్ముడువగైరాలు.

"నేనన్నదీ అదే" అంటూ కూర్చున్నారు ఆంజనేయులుగారు అయిష్టంగా కూర్చున్నట్టు ముఖంపెట్టి.

"మా అన్నయ్య ఇరవై వేలిస్తాడు గానీ, ఇంకేం చెప్పకండి."

"లాంచనాలు కాక కనీసం పాతిక్కైనా ఇవ్వండి."

"అదీ ఇదీ కాదుగాని, ఇరవై రెండిస్తారు ఇంకేం అడ్డు చెప్పకండి మరి. బంగారం ఏం పెడతారో ఒక మాట చెబితే ..."

"ఆటువంటి వాటిల్లో మేం తక్కువ ఉండం. పద్దెదువేల బంగారం పెడతాం. కాని పెళ్ళి ఇంటి దగ్గరే జరగాలి. బ్రహ్మాండంగా చెయ్యాలి. మా వూరు వూరంతా తరలి వస్తుంది మరి. ఈ విషయంలో రాజీ పడటం అనేదిలేదు. అలాగే లాంచనాలు కూడా మా ప్రతిష్టకు తగ్గట్టుగా జరగాలి ..."

ఆంజనేయులుగారి మాటలకి రామచంద్రయ్యగా రేదో అనబోతోంటే ఎవరోవచ్చి "అమ్మాయిని రమ్మన్నారా?" అనడిగారు.

"వీధిలో కూర్చుంటాం రమ్మనండి. అమ్మాయిని చూడటం మయ్యాక మిగతా విషయాలు మాట్లాడుదామండీ."

"అలాగేనండి" రామచంద్రయ్య గారు బదులిచ్చారు.

ఆంజనేయులుగారూ, చంద్రం, పరమేశ్వరీ వీధి అరుగు మీద బట్టల షాపు గుమ్మం లోపల వేసిన కుర్చీల్లో కూర్చున్నారు.

కాస్సేపటికి శారద వీధిలోంచొచ్చింది. ఆమె పాలిస్టర్ చీర కట్టుకుంది ముఖానికి చిన్న తిలకం బొట్టు పెట్టుకుంది. చెవులకి రింగులూ, మెడలో ఒంటిపేట గొలుసూ ధరించి సింపుల్‌గా వచ్చింది. అయితేనేం? చాల అందంగా ఉంది సహజ సౌందర్యంతో.

ఇంతక్రితం కన్నా అందంగా కన్పించే సరికి మూర్ఛబోయి నంత పనయ్యింది వాళ్ళకి.

కర్చీఫ్‌తో ముఖానికి పట్టిన చెమటలు గబగబా తుడిచేసుకున్నాడు చంద్రం.

శారద నుదురు చిన్నగా ముడివడింది. మెల్లగా వాళ్ళని తప్పించుకుని బట్టలషాపులోకి నడిచింది.

"నువ్వేమైనా అడుగుతావుట్రా" ఆంజనేయులుగారి మాటకి తల అడ్డంగా వూపాడు చంద్రం.

"ఇహ నువ్వు లోపలి కెళ్ళమ్మాయ్" అని ఆంజనేయులు గా రన్నారో లేదో చంద్రా న్నుద్దేశించి శారద అంది "క్షమించాలి. మీ రే బాంకుకైనా సెలక్టయ్యా రాండి?"

వూహించని విధంగా వూహించని ప్రశ్న అడిగే సరికి బిమ్మరబోయా రంతా.

తన మాటలు విన్నది కాబోలు నమకుంటూ "సెలక్టయ్యిన ట్టింకా రాలే డనుకో కాని, త్వరలోనే వస్తుంది. మా వాడు రెండు మూడు బాంకు పరీక్షలు రాశాడు" అని చెప్పి ముఖం అప్రసన్నంగా మార్చుకుని ఇబ్బందిగా చూశారు ఆంజనేయులు గారు ఆమె తరపు వారివంక.

శారద చిన్నాన్న గబుక్కున ముందుకొచ్చి "రా శారదా" అని పిల్చారు భయపడుతూ.

"వచ్చేస్తున్నా, బాబాయ్! మీ రోసారి ముఖం కడుక్కుంటారా ప్లీజ్" అంది చంద్రంతో సూటిగా.

ఆమె అలా అన్నదో, లేదో వో కుర్రాడు పెద్ద చెంబుతో నీళ్ళూ, సబ్బుపెట్టె, టవలూ పట్టుకునొచ్చి అరుగు మీద నిలబడ్డాడు చంద్రంవంకచూస్తూ.

చంద్రం ముఖం రక్తహీనమయ్యింది.

పరమేశ్వరి విస్తుబోయింది.

ఆంజనేయులుగారు ఆగ్రహంతో చూశారు. "ఏమిటి మీ ఉద్దేశ్యం? మేం వచ్చింది పిల్లని చూసుకోవడానికి."

"మీ రలా కోప్పడితే ఎలా, బావగారూ. అమ్మాయి కేదో అనుమాన మొస్తేనూ ..."

రామచంద్రయ్యగారి మాటలు పూర్తి కాకుండానే "అనుమానమా?" అడిగారు నుదురు చిట్లించి.

"అవునండి. నా ముఖాన్ని, వారి ముఖాన్నీ చూసి చెప్పండి. ఆయనకి నేను సరిపోతానో, నాకు ఆయన సరిపోతారో" అనేసి లోపలి కెళ్ళిపోయింది శారద.

అయోమయంగా మేనల్లుడి వంక చూసిన ఆంజనేయులుగారు అదిరి పోయారు.

మేకప్పు చెదిరిపోవడంతో చంద్రం ముఖంలోని స్ఫోటకపు మచ్చలు స్పష్టంగా కన్పిస్తున్నాయి! కృత్రిమ వంకీలు చెరిగిన జుట్టు పీచులా ఉంది! జరిగిన అవమానానికి నల్లని ముఖం మరింత నల్లగా కనిపిస్తోంది!

చంద్రం ఉర వాలిపోయింది!

"ముఖం కడుక్కుంటారా?" అ కుర్రా డడిగాడో, లేదో "అక్కర్లేదు. ఇంత జరి తెగించే సంబంధం మా కక్కర్లేదు" అని విసురుగా లేచారు ఆంజనేయులుగారు.

చంద్రమూ, పరమేశ్వరీ ఆయనను అనుసరించగా మిగతా వాళ్ళు బొమ్మల్లా నిలబడిపోయారు! *




SAA/HSI/20 TEL